# తూరుపోళ్ళు

''ఎకరానికెంతుచ్చుకుంటారు?'' అడిగేడు మాఅబ్బులుమావయ్య.

చెప్పేడు తూరుపోళ్ళ మేస్త్రి బొడ్డుసూరయ్య.

''పాపం పాటకపోళ్ళు అమాయకులు అనుకున్నాను. మీక్కూడా తెలివుందిరోయ్'' అన్నాడు మాఅబ్బులు మావయ్య.

ఆ మాటకి ''నిజంగా తెలివైనోళ్ళం మేం'' అనుకుని చాలా సంబరపడిపోయిన తూరుపోళ్ళు వాళ్ళ మకాం ఉంటున్న వంతెనకింద సత్రంలో ఫుల్లుగా తాగేసి నానా అల్లరీ చేసేరు.

* * *

వెలగలభామిరెడ్డిగారింట్లో అద్దెకుండేవాళ్ళం. నెలకి రెండురూపాయలు. మేం ఉండే ఇంటికెదురుగా చాలా పాతకాలం నాటి వాడ్రేవు జమీందార్ల దివాణముండేది. చుట్టూ మూడొంతులు పడిపోయిన ప్రహారీగోడ.

ఆ ఇంటిలోపల పెద్ద బాదం చెట్టు. మేమంతా పడిపోయిన గోడలు దాటుకుని లోపలికెళ్ళి బాదం కాయలు ఏరుకునేవాళ్ళం. అలా ఏరుకుంటున్నప్పుడే మిషనుకుట్టెంకారెడ్డి గారబ్బాయి సుందరయ్యకి చిన్న కంచు మరచెంబు దొరికిందోసారి. ఇంకోసారి చిన్న వెండిపళ్ళెం దొరికింది నాకు. ఇలా నా ఈడు కుర్రోళ్ళు ఆ గోడలు దాటి బాదం చెట్టు కిందకెళ్ళినప్పుడు చిన్న చిన్న సామాన్లు చాలా దొరికేవి. దొరికింది మా అమ్మ కిచ్చేను. బయటే ఇన్ని సామాన్లు దొరుకుతున్నాయి. లోపల గదుల్లో ఇంకా ఎన్ని సామాన్లున్నాయోనని ఆ వెండిపళ్ళెం ట్రంకుపెట్లో దాచేసింది మా అమ్మ.

ఆ మధ్య కాస్త అమ్మకానికొస్తే మెరకంతా తోలేసి పంటచేను చేద్దారనే వుద్దేశంతో మా అబ్బులుమావయ్య కొనేశాడు.

కోతల రోజులొచ్చినియ్యి. ప్రతిఏడూ లాగే తూర్పు జనం దిగిపోయారు చెల్లూరు వంతెనకింద సత్రంలోకి.

ఒక సాయంకాలం పూట వాళ్ళ దగ్గరకెళ్ళేసరికి వాళ్ళ మేస్త్రి బొడ్డు సూరయ్య ఎదురొచ్చి మా అబ్బులుమావయ్యకి ఒంగిఒంగి దణ్ణాలు పెట్టి ''ఎన్నెకరాలు బాబూ తమది'' అన్నాడు.

''పదెకరాలు కోసి కుప్పెయ్యడాని కెంత కాంట్రాక్టు'' అడిగాడు మా అబ్బులుమావయ్య.

రేటు చెప్పేడు బొడ్డుసూరయ్య.

''బాగుంది పదెకరాల పొలం దాయ తియ్యడానికి అదేరా మెరక తియ్యడాని కెంతిచ్చుకుంటారు'' అన్నాడు.

''రేపోసారి చూసి గానీ చెప్పలేం బావూ ఏటంతరు?'' అన్నాడు సూరయ్య.

మర్నాడు తను కొన్న దివాణం దొడ్డి చూపించాడు మా అబ్బులుమావయ్య.

''అమ్మో... దీన్ని పంట పొలం చెయ్యాలంటే మూడుబెడ్డల వరస తియ్యాలి బావూ. అయిదెకరాలన్నారు గదూ.

మా నలభైమందీ ఆరునెలలపాటు తీసినా తరగదు'' అని నోటిలెక్కలు గట్టి రేటు చెప్పాడు.

బొడ్డుసూరయ్యని పంపించేసి ఊరికి ఇంకో మూల ఉంటున్న ఉప్పరివాళ్ళని కల్సి అడిగాడు. వాళ్ళు తూర్పోళ్ళకంటే ఎక్కువ చెప్పారు. మాచవరంలో కూలోళ్ళనడిగాడు. చెల్లూరు కవతల కురకాళ్ళపల్లి జనానికి కబురు చేశాడు.


అంతాకూడా తూర్పోళ్ళకంటే ఎక్కువే చెప్తున్నారు.

చివరికి తూర్పోళ్ళమేస్త్రి బొడ్డు సూరయ్యకి కబురుచేసి చాలా గుల్లమట్టి అది. రెండు రోజులు తవ్వి చూడండి పని సులువుగా తెమలకపోతే మీరడిగిన కూలీ ఇస్తాను అన్నాడు అబ్బులుమావయ్య. ''చిన్నప్పుడ్నుంచీ ఈ పన్లోనే ఉన్నాం బావూ ఆ పాటిమట్టిని తవ్వాలంటే చాలా కష్టం బావూ'' అన్నాడు మేస్త్రి సూరయ్య.

కోపమొచ్చింది మా అబ్బులు మావయ్యకి. 'మేం కూడా చిన్నప్పట్నుంచీ ఈ మట్టిలో దిగడేఉన్నాం. ముందు రెండురోజులు తవ్వి చూడండి నిజంగా మీకు కష్టమైతే రెట్టింపుకూలీ ఇస్తాను సరేనా?'' అనేసరికి సరేసరే అనెళ్ళిపోయేడు తూరుపోళ్ళమేస్త్రి.

హుషారుగా పాటలు పాడుకుంటూ తవ్వడం మొదలెట్టారు. చల్దిపొద్దుదాటింది. తవ్వుతున్న వాళ్ళలో ఒకడయిన తవిటయ్యకి లావుపాటి వెండి గొలుసు దొరికిందా మట్టిలో.

ఆశ్చర్యపోయేరంతా. అది మనల్ని కూలికి పెట్టుకున్న ఆ రెడ్డిగారికి చూపించాలా వద్దా అన్న విషయం మీద తెగదెబ్బలాడుకున్నారాళ్ళు.




మర్నాడు పొద్దుట దారినపోతున్న బంగారపు పని చేసే ముసలి గున్నయ్యగారు ''ఈ నేలలో చాలా వస్తువులు దొరుకుతాయి తెల్సా...'' అన్నాడు.

''ఎందుకు దొరుకుతాయండీ బ్రెమ్మంగారూ?'' ఎదురడిగేడు తవిటయ్య.

నవ్వేసిన గున్నయ్య ''ఇది ఒకప్పటి వాడ్రేవు జమీందార్ల దివాణం'' అన్నాడు.

''నిజవాండీ బ్రెమ్మంగారూ?'' అమాయకంగా అడిగిన తవిటయ్యని పెద్ద చప్పుడొచ్చేలాగ లాగిపెట్టి గూబమీద కొట్టేసిన గున్నయ్య ఆకాలంలో జరగిందొకటి చెపుతూ అప్పుడు నేను చాలా కుర్రోడ్ని. ఆరోజుల్లో ఇప్పుడు మనం నిలబడున్న ఈస్థలంలో వాడ్రేవు జమీందార్ల దివాణం ఉండేది. ఘడియ..ఘడియకీ దివాణంలోంచి భేరీ మోగించేవాళ్ళు. ఆ చప్పుడుకే ఐతే ఇప్పుడింతటయిమయ్యిందన్న మాట



అని అనుకునేవోరు ఈవూరిజనం.

వాడ్రేవు మాలక్ష్మమ్మగారు సామ్రాజ్యానికి అధిపతి. పెత్తనమంతా ఆవిడిదే. అగ్గిపెట్టిలో పట్టేంత పల్చని చీరనేస్తే మొట్టమొదట కట్టింది ఈ మారాణీగారేనట. ఆవిడగారి నవ్వితే గాలికి ఊగే అరిటాకు వెనకాల చందమామ లాగుండేదంట. ఆవిడిశరీరం రంగు బంగారవంట మంచినీళ్ళు తాగుతుంటే కంఠంలోంచి దిగడం కనిపిస్తది. అంతరంగు మరి. ఆ మారాణి అందాన్ని చూడ్డానికి ఎక్కడెక్కడినించో ఎడ్లబళ్ళు

కట్టుకుని మరీ వచ్చేవోరు. ఆవిడికి ముగ్గురు అన్నలు. పెళ్ళాలమాటల్తో మారిపోయిన ఆ ముగ్గురన్నలూ చెల్లెలు మాలక్ష్మిమీద కక్షకట్టేరు. పోను పోను ఆళ్ళు ఎలా తయారయ్యేరంటే ఆ ఇంట్లో తూస్తే మణుగుల లెక్కనుండే బంగారాన్ని పట్టుకుపోదారని అవిడియా వేసేరు. ఆ పన్నాగం ముందే ఓ కొజ్జావోడిద్వారా చెవిని పడ్డంతో మొత్తం నగల్నీ కాసుల్ని ఇత్తడి బిందెల్లో సర్ది ఈ నేలలోనే కప్పెట్టేసి ఆళ్ళకి దొరక్కుండా చేసిందంట. మారాణి మాలక్షమ్మగారు.

ఆ తర్వాత గోదావరి పుష్కరాలొస్తే సవ్వారీ బండి కట్టించుకుని కోటిపల్లి స్నానానికెళ్ళిన మాలక్షమ్మగారు గోదాట్లో కత్తిరోడ్డులో దిగబడిపోయి కాలం చేసింది.

ఆ దేవత పోయేకా దివాణం కళమొత్తం పోయింది. పోను పోను అంతరించిపోయింది.

ఆ నగలు అయ్యీ ఎక్కడున్నాయ్యో తెలీక దివాణంలో అడ్డమైన చోటా వెతికిన ఆ అన్నలు ఆయుషుమూడ్డంతో కాలం చేసేరు అనేసెళ్ళిపోయేడు డబ్బయ్యేళ్ళ ముసలిగున్నయ్య. అతనలా వెళ్ళిన వెంటనే మేస్త్రీ బొడ్డుసూరయ్య పొలికేకతో పన్లన్నీ ఆపేసేరు తూర్పోళ్ళు. పదండి మన మకాం దగ్గరకి అంటే వాడెనకాలే బయల్దేరేరు.

రాత్రయ్యింది.

సత్రం పైనున్న ఎర్రకంకర రోడ్డు మీంచి అటు రామచంద్రపురంవేపూ ఇటు చెల్లూరుసైడూ వెళ్ళేఎడ్లబళ్ళూ డి.టి.14 ట్రాక్టర్లూ వెళ్తా వస్తా ఉన్నాయి. గోదారి కాలవలో రాదారి పడవలూ, గండ్రు ఇసకలోడు పడవలూ వెళ్తా వస్తున్నాయి. దిగువలో ఉన్న సత్రం గోడల్లోంచి వచ్చే ముతకవాసన ముక్కు వాసన కాల్చిన చుట్టాబీడీల వాసన. వెలుగుతున్న కిర్సనాలు దీపాలమధ్యలో కూర్చున్నారు తూరుపోళ్ళు. వాళ్ళ మధ్యలో కూర్చునున్నాడు మేస్త్రీ బొడ్డుసూరయ్య.

"చిట్ట చివరిగా మనోళ్ళందరికీ నే చెప్పేదేంటంటే రేపట్నుంచి మనందరం మూసుకున్న నోరు ఇప్పకుండా రెండురోజులపాటు ఆ నేలలో తవ్వుకుంటా పోదాం. ఆ తల్లి మాలక్ష్మిగారు కప్పెట్టిన ఇత్తడి బిందెలు మనసొంతం చేసేసుకుందాం. మీరంతా ఏటంతరు?'' అన్నాడు. "మావేటంతవు... నువ్వేటంతా అదే మావూఅటంతవు'' అనేసి ఒప్పేసుకున్నారంతా.

తూర్పున ఎర్రవారి తెల్లవారింది. గోపాల్రావు కాఫీహోటేలు తెరిచి అప్పటికే చాలా సేపయ్యింది. మంత్రాల మూర్తిగారు స్నానం చేసి కాలవకిందున్న మా వూళ్ళోకి దిగుతున్నాడు. సంతకాడ ఆగిన ముగ్గుపడవలో కొత్తగా పెళ్ళయిన మొగుడూపెళ్ళాలు లేచినట్టున్నారు. నాజూగ్గా భలే తమాషాగా ఊగుతుంది పడవ లోపల్నుంచి ఆడమనిషిమూలుగులు మగోడి ఎగశ్వాస బయటికి వినిపిస్తున్నాయి. పారలూ తట్టలూ చద్దన్నం మూటలూ పట్టుకుని వంతెన దిగి జమీందార్ల దివాణం పక్కకి బయల్దేరిన తూరుపోళ్ళు ఆ చోటకెళ్ళేక మరి తవ్వడం మొదలెట్టేరు.

మధ్యాహ్నానికి ఒక వెండిబిళ్ళ దొరికింది. సాయంకాలానికి కంచు తపేళా, మరచెంబు దొరికినియ్యి. ఇదంతా చూస్తున్న వాళ్ళలో ఆరాటం మొదలైంది. గున్నయ్య చెప్పింది చాలా నిజం అని ఇంకోసారి అనిపించింది.

కంచుమరచెంబూ తపేళా దొరికిన అవిశయ్యా, వెండి బిళ్ళ దొరిగి కర్రినాయుడూ కల్సి సారాతెచ్చిస్తే పూటుగా తాగేసిన తూరుపోళ్ళు చాలా హుషారుగా తయారయ్యేరు.

వాళ్ళమధ్యలో కొచ్చిన మేస్త్రీ బొడ్డుసూరయ్య "మనలో ఎవడో ఒకడికి మారాణి మాలక్షమ్మగారు నేలలో దాచిన లంకెలబిందెలు తొందర్లో దొరికి తీరతయ్యి. అయితే ఆ దొరికినాటిని మనమంతా చెరి సమానంగా పంచుకోవాలి ఏటంతరు?'' అనడిగేడు.

అంతా ఒప్పుకున్నా ప్రకాశం ఎర్రోడూ ఇద్దరు మట్టుకి ఎదురు తిరిగేరు.

''అంతా ఒప్పుకుంటే మీరేంట్రా?'' అన్నాడు బొడ్డుసూరయ్య.

''మాకు దొరికితే మట్టుకి మేమివ్వం'' అన్నాడు యెర్రోడు.

''ఎందుకివ్వర్రా... అసలు మీ అందర్నీ ఈ పక్కలకి తీసుకొచ్చింది నేను. మీరింత తినడానికి దారిచూపించింది నేనూ నాకే ఎదురు చెపుతార్రా?'' అని రంకెలేసేడు బొడ్డుసూరయ్య.

''ఎర్రికుక్కలాగ నువ్వెంత సేపు అరిచినా మేం ఒప్పుకో. దొరికిన దాంట్లో అసలు వాటా ఇయ్యం అంతే'' అనేసేడు ప్రకాశం.

గొడవ బాగా ముదిరింది. వాళ్ళలో వాళ్ళకి చాలా యుద్దాలు జరిగినియ్యి. చివరికి ఆరిపోయిఉన్న పొయ్యిలో మూడు ఇటుకల్లో ఒక ఇటిక తో యెర్రోడి బుర్రబద్దలు కొట్టేసేడు తవిటయ్య.

కారిమట్టిలో పడి ఇంకుతున్న రక్తంచూసి బెంబేలెత్తిపోయేరంతా. గబగబా కోమలి సుబ్బారావు రిక్షా ఎక్కించుకుని రామచంద్రపురం హాస్పిటలుకి తీసుకెళ్ళేరాడ్ని.

* * *

ముసలోళ్ళు మధ్య వయసోళ్ళు చివరికి చంటిపిల్లలూ అంతా తవ్వేపనిలోనే ఉన్నారు. దీపాల వేళయినా తవ్వడం ఆపడం లేదు. అక్కడి కొచ్చిన మా అబ్బులు మావయ్య ''చీకటి పడ్తుంది. ఇక ఆపండ్రా'' అంటున్నా ఆపడం లేదు.

ఆవేళ పొద్దుటే సరాసరి వాళ్ళుండే సత్రంలో దిగడ్డ మా అబ్బులుమావయ్య. ఆ మట్టిలో లంకెలబిందెలున్నాయని చెప్తున్నారు మావూరిజనం. ''ఇష్టమైతే ఉండండి లేకపోతే లేదు. ఇవ్వేళ్టినించీ మీకు కూలీ ఇవ్వను. దొరికితే ఆ లంకెలబిందెలు మీయే... ఏవంటారు?'' అన్నాడు. ''మీరు చెప్పిందానికే ఒప్పుకుంటాం'' అన్నాడు బొడ్డుసూరయ్య.

ఇక ఆరోజునించీ తెగ కష్టపడి తవ్వుతున్నారు తూరుపోళ్ళు.

రాత్రి పగలనక కష్టపడి తవ్వుతున్నారు.

ఒకటి రెండు రాగి డబ్బులు ఒక రాగిచెంబూ, ఇత్తడికుంచం దొరికినియ్యి.

వాళ్ళ దగ్గర గింజలయిపోయాయి.

కూలి ఇవ్వనన్న మాఅబ్బులు మావయ్య అనుమతి తీసుకుని ఒకరోజు ఊళ్ళో కూలికి వెళ్ళి ఆ వచ్చిన దాంతో గెంజి కాచుకుని రెండోరోజు మళ్ళీ పనికొచ్చేరు. మూడోరోజు బయటకూలికి. నాలుగోరోజు తవ్వకానికి. అయిదోరోజు బయటికూలికి ఆరోరోజు తవ్వకానికి.

ఇలా ఆర్నెల్లుగడిచినియ్యి. దొడ్డి పల్లపుపొలంగా మారింది వాళ్ళకి లంకెలబిందెలింకా దొరకలేదు. తూర్పుజనం మా అబ్బులుమావయ్యతో చేసుకున్న ఒప్పందం ప్రకారం పని పూర్తి చేసి నీర్సంగా నడుచుకుంటా తలలు వంచుకుని కలలు కళ్ళల్లోనే పెట్టుకుని వాళ్ళ శ్రీకాకుళంప్రాంతాలకి వెళ్ళిపోయారు.

ముసలిగున్నయ్య మనవడు బుద్దాచారి పెళ్ళికెళ్ళి నూటపదార్లు చదివించిన మా అబ్బులుమావయ్య వాళ్ళు దాయ తీసి వెళ్ళిన నేలని పంట పొలం చేసి మా ఏరియాలో అంతకుముందు ఎవరూ ఊడ్చని బాసుమతి ఊడిపించేడా ఏడాది.

* * *